ప్రభంజనం లాంటి బాస్ ధాటికికూడా చెరగని చిరునవ్వులు నిలుపుకున్న చిరుద్యోగి చిదంబర రహస్యం యేమిటో?

"ఎంత కరోడా మేనేజరైనా నేనెన్నడూ ఖాతరుచేసి యెరుగను. పని శ్రద్ధతో చేసుకోవడం, సరదాగా మాట్లాడడం, ఇదే నా జీవిత సిద్ధాంతం. కాకాపట్టడం, చాడీలు చెప్పడం నావల్ల అయ్యేపనికాదు" అని మాఆఫీసుకు క్రొత్తగా బదిలీఅయి వచ్చినరోజె రామయ్యగారువుద్ఘాటించారు.

మాట్లాడుతున్నా సిగరెట్టును పెదవుల కొసలతో వదులుగా పట్టుకుని స్మోక్‌చేసే చేన్ స్మోకర్ ఆయన. ఆయన మొహంమీద యెల్లప్పుడూ సిగరెట్టుతోసహా చిరునవ్వుకూడా వుండవలసిందే. చిరునవ్వు ఆయన ట్రేడ్ మార్కులాంటిది. మాటలంటే ఆయనలో యెక్కడలేని వుల్లాసం పుట్టుకొస్తుందని, లాంగ్ ప్లేయింగ్ రికార్డులా అలా వాగుకుపోవడం, ఆయన మేన్ హాబీ అని ఆయన వచ్చిన తక్షణమే స్పష్టమయిపోయింది.

"ఈ ఆఫీసు మేనేజర్ ఛండశాసనుడని మీరంతా భయపడుతున్నారేమో- నేనింతకంటె భీకరమైన మేనేజర్లతో పోట్లాడి వాళ్ళ చెవులుపిండి గుంజీలు తీయించేను. నేను ఇదివరకు పనిచేసిన ఆఫీసులలో మేనేజర్లకు నేనంటే ఎంత హడల్‌అంటే నా ముందు ఎవరినీ కసరడానికికూడా వాళ్ళకు ధైర్యం చాలేది కాదు." అని రామయ్యగారు తన సీటులో కూర్చుని ప్రసంగం ప్రారంభించాడు. ఆయన సూపరింటెండెంట్ కాబట్టి ఆయన క్రిందనున్న క్లర్కులు, బంట్రోతు పుల్లయ్య శ్రద్ధగా వింటున్నారు. ఆయన చెప్పిన ప్రతి మాటకు తల ఆడించో, చిరునవ్వునవ్వో, "అలాగా", "ఛంపేశారు", "బ్రహ్మాండంగా వుంది." అనో బదులు చెబుతున్నారు. లోపల ఏమనుకుంటున్నా ఆయన చెప్పింది నమ్మినట్టు మొహం పెడుతున్నారు.

రామయ్యగారు పుల్లయ్యకి రెండు కాఫీలు తెమ్మనమని ఆర్డరిచ్చారు. రెండో కాఫీ ఎవరికోసమో తెలియలేదు కాని, పుల్లయ్య రెండు కాఫీలు తెచ్చి రామయ్యగారి ముందుంచాడు. ఆయన ఒక కాఫీ తీసుకుని రెండవదాన్ని పుల్లయ్యను తీసుకోమన్నాడు. దాంతో సినిమాకోసం తన నవల స్వీకరించబడిందని తెలిసి తెలుగు రచయిత్రి సంబరపడినట్టు పుల్లయ్య సంబరపడి, "అయ్యగారూ! మీ పాత ఆఫీసులో సుబ్బారావు వుండేవాడే- అతడు నాకు కనబడి మీ మేనేజర్ ఆటకట్టినట్టేలే. మీ ఆఫీసుకు రామయ్యగారు బదిలీ అయి వస్తున్నారట. రామయ్యగారు పులిలాంటి మనిషిలే అన్నారు" అని మస్కాకొట్టాడు.

రామయ్యగారు ఉబ్బితబ్బిబ్బయి. "ఏమన్నావు? ఏది, మరొకసారి చెప్పు" అని పుల్లయ్యచేత రెండవసారి ఆ మాటలు పలికించుకుని విని నవ్వుతూ, "ఓ! సుబ్బారావా! ఓహో సర్వేయర్ సుబ్బారావా? దొడ్డ మనిషిలే. ఇదిగో పుల్లయ్యా మరొక సిగరెట్టు తీసుకో" అన్నాడు.

తర్వాత తెలిసిన అసలు విషయమేమిటంటే పుల్లయ్యకు రామయ్యగారి పాత ఆఫీసులో ఏ సుబ్బారావూ తెలియదు. అసలు అతడికి ఆ ఆఫీసులో ఒక సుబ్బారావు వున్నట్టూ తెలియదు. తెలుగునాడులో ప్రతి ఆఫీసులో కనీసం ఒక సుబ్బారావు వుండడం ఖాయం కనుక మెదడుకు కాస్త శ్రమకలిగించి ఈ గాస్ కొట్టాడు. బాణం గురి మీద పడింది. ఇంతకీ ఆ ఆఫీసులో సుబ్బారావు నామధేయంగల ఉద్యోగి లేకపోయినా రామయ్యగారు మాత్రం "ఆ ఆఫీసులో ఏ సుబ్బారావూ లేడే" అని తనను సమర్థిస్తున్న పుల్లయ్యను కొట్టిపారేసే ఆవు మొహమూ కాదు. చరణ్‌సింగ్ ప్రభుత్వాన్ని మధ్యంతర ఎన్నికలు ఆదుకున్నట్టు పుల్లయ్య పలికిన ఈ మాటలు రామయ్యగారికి చేయూతనిచ్చి హుషారు కలిగించాయి.

"మీకో సంఘటన చెప్పేదా, మా ఆఫీసుకు శ్రీరామమూర్తిగారని మేనేజరు వచ్చాడు. తలమీద వెంట్రుక లేదు కాని పేరు జటాధరరావు అన్నట్టు ఆయన తల్లిదండ్రులు నామకరణం చేస్తున్నప్పుడు పొరబడినట్టుంది. ఆయన సాక్షాత్తు రావణాసురుడే అనుకోండి. ఆయన నోటికి అడ్డంటూ వుంటేకదా. ఆఫీసులో ప్రతివాణ్ణీ పిలవడం, చచ్చేటట్టు చీవాట్లు పెట్టడం, కాగితాలు మొహాన కొట్టడం- ఇదీ ఆయన వరస. ఒక రోజు నావంతు కూడా వచ్చింది నన్ను పిలిచి మీరు చేసే పని తక్కువ కాని మాటలు యెక్కువఅని విన్నాను అన్నాడు

"మేనేజర్, నేను మర్యాద యిచ్చి పుచ్చుకుంటాను. పనిలో యేమైనా




# చెరగని చిరునవ్వు

## పులిగడ్డ విశ్వనాథరావు



లోటుంటే అనండి" అన్నాను. దాంతో ఆయన వీడెవడో దేవాంతకుడిలా వున్నా డనుకుని, 'సారీ, మిష్టర్ రా మ య్యా. కూర్చోండి టీ త్రాగుతారా, కాఫీ తీసు కుంటారా?' అని అడిగాడు.

"మీరు ఈ విధంగా సరదాగా మాట్లా




డితే వేరే కాఫీ. టీలు ఇచ్చి మర్యాద చేయనక్కరలేదు" అని ఖూర్చుని ఆయనతో సహా కాఫీ త్రాగి, సరదాగా కాలక్షేపం చేశాను.- ఆఫీసులో అంతా తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు ఆ రోజు.

మేనేజర్ జోగారావుగారి గురించి మీరు వినే వుంటారు. అతడు ఇంటి నుంచి ఆఫీసుకు బయలుదేరాడని వినగానే ఆఫీసులో ఉద్యోగస్తులు చేతులు కట్టుకుని నిలబడేవారు. అటువంటి యమధర్మరాజుని ఎలా లొంగదీశానో తెలుసా?...." అంటూ చెప్పుకుపోసాగాడు రామయ్యగారు.

ఆ బ్రాంచి క్లర్కులు రామయ్యగారి మాటలు విని జాలిపడ్డారు. పాపం! ఈయనకు ప్రస్తుత మేనేజరు భద్రంగారి గురించి ఏమీ తెలియదు కాబట్టి, అలా అంటున్నాడు. ఆ మాటకొస్తే భద్రంగారితో రామయ్యగారు చెప్పిన శ్రీరామమూర్తిగారిని, జోగారావుగారిని పోల్చి చూస్తే వాళ్ళు వేమన, తుకారామ్‌లాంటి యోగుల్లా కనబడతారు. మేనేజర్ గారి పిలుపు రాకూడదని ఆ ఆఫీసులో ప్రతి వ్యక్తి వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ వుంటాడు. పిలుపు వచ్చిందా శరీరంలోంచి చలిజ్వరం వచ్చినట్టు వణుకు బయలుదేరుతుంది, పళ్ళుకిటకిట కొట్టుకుంటాయి. ఆయన గది ముందుకు రాగానే చమటలు పోస్తాయి. యెదురుగా వెళితే గొంతు యెండిపోతుంది. ఇహ ఆయన చెప్పింది విన్నాక టాయిలెట్‌కు వెళ్ళే అవసరం వుండదు. ఈ భోగట్టాలు రామయ్యగారికి తెలియదు. కాబట్టి ఆయనకు వివరంగా తెలియజేశారు వాళ్ళు.

"మీరంతా మేకల్లా ప్రవర్తిస్తున్నారు కాబట్టి. అయన పులిలా మీ అందరినీ వేధిస్తున్నాడు. అదే మీరు మేక కాకుండా మేకు అవండి. ఆయన ఏం చేయగలడో చూద్దాం. మీరంతా చూస్తూ వుండండి ఆయన్ను నేనెలా దారిలోకి తెస్తానో. అంతెందుకు? నేను క్రొత్తగా ఉద్యోగంలో చేరినప్పుడు ఆంబోతుల చంద్రశేఖరం అని మేనేజర్ వుండేవాడు. అతడి పేరు చెబితేనే అంతా గజగజవణికిపోయేవారు."

ఇంక రామయ్యగారు తన ట్రేడ్‌మార్కు చిరునవ్వుతో తన మరొక దండయాత్ర గురించి చెప్పబోతున్నారని తెలిసి క్లర్కు కామేశం. "ఏమండీ సూపరింటెండెంట్ గారూ! గొట్టెపుబావుల ఋణాల అకౌంట్స్‌పై ఆడిట్ కామెంట్సు చదివారా!" అని అడిగాడు.

"అది చదివేస్తాలేవయ్యా ఇంతకీ ఆంబోతుల చంద్రశేఖరం...."

"కొద్దిగా కాఫీ త్రాగి వస్తానండీ." అని కామేశం మరి లాభం లేదని తెలుసుకుని తప్పుకున్నాడు

"ఫోను చేయాల"ని, క్లర్కు పద్మనాభం రూము బైటకు నడిచాడు.

"కాస్త జనరల్ బ్రాంచిలో పనుంది" అని అవతారం జారుకున్నాడు.

"నేనూ వస్తున్నాను. ఉండు అవతారం" అని రంగారావుకూడా బయటకు పరుగెత్తాడు.

బ్రాంచిలో పుల్లయ్య. రామయ్యగారు. శ్రీనివాసరావు వుండిపోయారు. శ్రీనివాసరావుకూడా ఏదో సాకుచెప్పి జారుకునేవాడేకాని, అప్పుడే అతడు టేబిల్‌మీద ఫైళ్ళపై తలపెట్టి నిద్రాదేవిని ఆరాధిస్తున్నాడు. మిగతా మూడు సీట్లూ పొద్దుట నుంచే ఖాళీగా వున్నాయి. దాంట్లో ఒకతను సెలవుపెట్టి సుందరం నెలవు మీద వున్నాడు. మిగతా యిద్దరు క్లర్కులూ ముందునుంచే సాకు చెప్పి పలాయనం చిత్తగించారు.

"పుల్లయ్యా. ఆ చంద్రశేఖరం గురించి చెప్పమన్నావుకదూ. ఐతే రెండు కాఫీల కోసం చెప్పిరా. ఆ శ్రీనివాస రావును కాస్త లేపు. ముందు చంద్రశేఖరం కథ విని కాఫీ తాగుదువు కాని." అంటూ కథ ప్రారంభించాడు రామయ్యగారు. పుల్లయ్య లేపడంతో శ్రీనివాసరావు లేచి యేమిచేయడానికి పాలుపోక రామయ్యగారి కథ విన నారంభించాడు.

రామయ్యగారు బదిలీ అయి వచ్చిన రెండు రోజులకు మేనేజరుగారి పిలుపు వచ్చింది. ఆయన్ను కలుసుకొని వచ్చినా ఆశ్చర్యం. రామయ్యగారి మొహంలో చిరునవ్వు మాత్రం కాస కూడా వాడ లేదు. అదొక రికార్డనే చెప్పాలి. ఇంత వరకు ఆయన రూమ్‌లోంచి బైటకు వచ్చిన వ్యక్తి చిరునవ్వుతో రావడం ఇదే మొదటిసారి.

"మేనేజడుగారు ఏమన్నారు" అని అడగ్గా- రామయ్యగారు మందహాసంతో ఇలా చెప్పారు:

"నన్ను చూస్తూనే. మీరు క్రొత్తగా బదిలీ అయివచ్చారుగా! మీ బ్రాంచిలో అకౌంట్స్ బోలెడంత పెండింగ్‌లో వుంది. అదంతా ఒక వారంలో కియర్ చేయాలి. మరి ఎలా చేస్తారో మీరే చూసుకోవాలి" అన్నారు.

"నేను రాత్రింబవళ్లు పనిచేసి క్లియర్ చేస్తాను అయితే అకౌంట్స్ ఒక వారం రోజులలో క్లియర్ అవవచ్చు. లేక ఒకటి రెండు రోజులు ఆలస్యమూ అవవచ్చు." అని బదులు చెప్పాను సిగరెట్టు పొగ వదులుతూ.


ఆయన నా ప్రక్క ఎగాదిగా చూసి. మీసాలు దువ్వి. 'సరే వారం రోజులలో ఎంత పనైతే అంతే చేయండి వారం తర్వాత మాత్రం చేసిన పనిని నాకు రిపోరు చేయండి.' అన్నాడు. సరే అని చెప్పివచ్చేశా."

వారం తిరిగింది. రామయ్యగారు ఈలోగా పెండింగ్ అకౌంట్స్ పని మాత్రం ప్రారంభించలేదు. కనీసం అకౌంట్సు బుక్స్‌వున్న బీరువా తాళంతీసి పుస్తకాల దుమ్ము కూడా దులపలేదు. ఆయన నిజంగా గుండె నిబ్బరంగల మనిషి లాగే వున్నాడు. ఆ రోజు మేనేజరుగారికి రిపోరు చేయాలికాని రామయ్యగారు ఖాతరు చేయలేదు. సాయంకాలం అయినా మేనేజరుగారు కబురు పంపలేదు. ఇహ రామయ్యగారు గర్వంగా, మందహాసంతో సిగరెట్ చే పెదాలపై నృత్యం చేయిస్తూ, "నాగురించి ఆయనతెలుసుకునివుంటాడు. మరి నన్ను సంజాయిషీ అడిగే ధైర్యం ఎలా వసుంది?" అంటూ సిగరెట్టు తీసి నుసి ఝళిపించాడు.

మర్నాడు మేనేజరుగారు రాగానే రామయ్యగారికి కబురు పంపారు. రామయ్యగారు చిరునవ్వుతో బయలు దేరాడు. కొద్దిసేపు తర్వాత తిరిగివచ్చాడు కాని, చిరునవ్వు అలాగే వుంది హుషారుగా చెప్పనారంభించాడు:

అగ్రశ్రేణి రచయిత్రి
వాసిరెడ్డి సీతాదేవి
సరికొత్త నవల ఇదీ కథ! వెల: 12.00
అన్ని పుస్తకాల షాపుల్లోనూ దొరుకుతుంది. లేదా పుస్తకం ధరలో 1 రూపాయి తగ్గించి M.O చేయండి. ఆరూపాయికి V.P.లో పంపుతాము.
డీలక్స్ పబ్లికేషన్సు
ఏలూరు రోడ్, విజయవాడ- 520002 *

పళ్ల డాక్టర్లు చెబుతున్నారు
చిగుళ్ల బాధలు, దంతక్షయం అరికట్టడానికి,
నియమానుసారంగా పళ్లను బ్రష్ చేసుకొని,
చిగుళ్లను మాలిష్ చేసుకోవాలి.
ఫోర్‌హాన్స్ డబుల్ యాక్షన్
టూత్‌బ్రష్ వాడండి
మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్ కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.




పళ్లను బ్రష్ చేసుకోవడానికి, చిగుళ్లను మాలిష్ చేసుకోవడానికి ఫోర్‌హాన్స్ పద్ధతి నేర్చుకోండి. "పళ్లు, చిగుళ్లను గురించి తీసుకోవలసిన శ్రద్ధ" అనే రంగుల పుస్తకం ఉచితంగా కావాలంటే పోస్టు ఖర్చుకోసం 25 పైసల స్టాంపు జతపరుస్తూ, ఈ చిరునామాకు వ్రాయండి: ఫోర్‌హాన్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, డిపార్ట్‌మెంట్ నెం. B46-219, పోస్టు బేగ్ 11463, బొంబాయి 400 020. ఏ భాషలో కావాలో వ్రాయండి.
ఫోర్‌హాన్స్ టూత్ బ్రష్‌లు
ఇంటిల్లిపాది కోసం
అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్) * జూనియర్ * బేబీ
Regd. T.M: Geoffrey Manners & Co. Ltd. 219F-152 TEL

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.
SUVARNA

"అకౌంట్స్ పని కాలేదని చెప్పా. నాకు నిన్న ఎందుకు రిపోర్టు చేయలేదని మండిపడ్డాడు. దాంతో నాకూ చిరాకెత్తి 'ఇవిగో మీఅకౌంట్స్ బుక్స్ బీరువా తాళం చెవులు' అంటూ తాళంచెవులు ఆయన ముందు పడేసి. మీ ఇష్టం వచ్చిన వాళ్ళకివ్వండి ఈ తాళం చెవులు. ఈ పని నేను చేయను అని ఖచ్చితంగా చెప్పేశాను. ఏం పులయ్యా, తాళం చెవులు పడేయడం వినపడిందా? నువ్వు మేనేజర్ గారి గది బైటే వున్నావుగా?" అన్నాడు.

"తాళం చెవులు ఖంగుమని క్రింద పడడమూ, మీరు గొంతెత్తి బదులు చెప్పడమూ నేను వినకపోవడమేమిటి బాబు. నేను అప్పుడు అయ్యగారి బంట్రోతు వెంకటేశంతో మాట్లాడుతున్నాగా" అన్నాడు పుల్లయ్య, రామయ్యగారిని సమర్థిస్తూ.

మేనేజర్‌గారి గది బైట నిలుచున్న కాష్ బ్రాంచి జగన్నాథం, లోన్స్ బ్రాంచి చొక్కారావుకూడా తాళం చెవులు చప్పుడు విన్నామని సాక్ష్యం చెప్పారు.

"తర్వాత ఏమయింది?" అని మేము ఆతృతగా అడిగాం.

"ఏమవుతుంది. దాంతో ఆయన చల్లబడి 'అదేమిటి రామయ్యగారూ! మీరు అలా అంటే ఎలా. ఆ తాళం చెవులు తీసుకుని మీకు వీలయినప్పుడే పని పూర్తి చేయండి" అన్నాడు.

"అలా చెప్పండి. మీరు రిక్వెస్టు చేస్తున్నారు కాబట్టి ఎల్లుండికల్లా ఎకౌంట్సు పూర్తిచేసి మీకు అప్పచెప్పుకుంటాను అన్నాను."

అన్నట్టుగానే రామయ్యగారు ఆ రోజల్లా, ఆ రాత్రల్లా, ఆ మర్నాడూ, రాత్రీ కూడా కష్టపడి, ఇంటినుంచి భోజనం తెప్పించుకుని, కాఫీమీద కాఫీ త్రాగి, డజన్లకొద్దీ సిగరెట్టు పెట్టెలు తగలబెట్టి ఎకౌంట్సు పని పూర్తిచేసి అప్పజెప్పాడు.

ఇది జరిగిన వారం రోజులమాట. రామయ్యగారు సీటులో లేరు. మేనేజరుగారి పి. ఏ. లక్ష్మి, రామయ్యగారి బ్రాంచిలోకి వచ్చింది. ఆమె మేనేజరుగారి రూమ్‌లోనే కూర్చుంటుంది. కాబట్టి అక్కడ జరిగే భోగట్టాలన్నీ ఆమెకు తెలుసు.

"ఏమమ్మా లక్ష్మి- ఇన్నాళ్ళకు మన మేనేజరుగారికి ఎదురు చెప్పి నిలబడగలిగే మొనగాడు మన ఆఫీసులో వెలిశాడు." అన్నాడు పద్మనాభం.

"ఎవరండీ ఆ మొనగాడు?" అని అడిగింది ఆమె.

రామయ్యగారని చెప్పగానే నవ్వ నారంభించింది.

"ఎందుకలా నవ్వుతారు?" అని అడిగాడు అవతారం.

"నవ్వకేం చేస్తాను. మేనేజరుగారి ముందు అందరికంటే వినయ విధేయతలతో మెసులుతాడు ఈయన. మీరంతా 'యస్సర్' అంటే 'చిత్తం, చిత్తం, చిత్తం' అంటాడీయన. ఆయన గది బైటకు వచ్చేటప్పుడు మీ అందరిలా ఆయన ప్రక్కకు వీపు తిప్పకుండా, వొంగి వెనక్కు నడుస్తూ వస్తాడు."

"మరి ఆరోజు ఎకౌంట్స్ బుక్స్ తాళం చెవులు మేనేజరుగారి టేబిల్‌పై విసిరి, బిగ్గరగా ఎకౌంట్స్‌పని తాను చేయనని చెప్పాడుట."

లక్ష్మి మరింత గట్టిగానవ్వి, "ఎకౌంట్స్ పని పూర్తి అయిందా అని మేనేజరుగారు అడిగేసరికి ఈయన ధైర్యం చిక్కించుకుని అవలేదన్నాడు. దాంతో ఆయన నిన్న ఎందుకు రిపోర్టు చేయలేదని బాగా చివాట్లు పెట్టి ముందు తాళం చెవులు అడిగి తీసుకుని నిన్ను ఎకౌంట్సు పనినుంచి తొలగించి హెడ్డాఫీసుకు రిపోర్టు చేస్తానన్నారు. అప్పుడు ఈయన క్షమాపణ చెప్పుకుని మరెన్నడూ ఇలా జరగదనీ రెండు రోజులలో ఎకౌంట్సు పూర్తిచేసి అప్పజెప్పుకుంటానని బ్రతిమాలాడు. అప్పుడు మేనేజరుగారు విసుగ్గా తాళం చెవులు ఈయనపై గిరాటు వేశారు."

"అయితే ఈయన మాతో చెప్పిన మాటలు గ్యాసన్నమాట."

"ఏమోకాని, రామయ్యగారు యెన్ని చీవాట్లు తిన్నా ఆయన చిరునవ్వుమాత్రం చెక్కు చెదరకుండా అలాగే వుంటుంది. ఆయనకు పడిన అక్షింతలు యింతవరకు యెవరికీ పడివుండవు" అంది లక్ష్మి.

"అమ్మ దొంగా" అనుకుని వెంటనే పుల్లయ్యను నిలదీశారు అంతా.

"నేనుమాత్రం లోపల జరుగుతున్న భాగోతం విన్నానా ఏమిటి. నేను అక్కడ ఆ సైమప్పుడు లేందే"


"మరైతే నువ్వెందుకు అలా చెప్పావు?"

"ఇంత మంది సూపరింటెండెంట్‌లు

వచ్చారు. వెళ్ళారు కాని వాళ్ళలో ఒక్కడైనా ఎన్నడూ నాకు టీ నీళ్ల కూడా పోసి ఎఱుగునా? రామయ్యగారు మాత్రం రోజూ కాఫీ ఇప్పిస్తారు, సిగరెట్టు కూడా ఇస్తూంటారు. అలాంటిది ఆ మనిషికి భళాభళీ చెప్పకపోతే మీకు చెప్పాలా?" అని అడిగిన వాళ్ళనే నిలదీశాడు.

కాష్ బ్రాంచి జగన్నాథం, లోన్ బ్రాంచి చొక్కా రావులను సంజాయిషీ అడిగ్గా "లోన జరుగుతున్న సంభాషణ మాకు వినపడితేగా. తాళంచెవులు క్రిందపడడం మాత్రం విన్నాం, అది చెప్పాం."

మొత్తంమీద రామయ్యగారి చిరునవ్వు మాత్రం కర్ణుడి కవచకుండలాలలా పుట్టుకతో వచ్చినదనే చెప్పుకోవాలి. ●




MCA/PDC/62/Tel